మలుపు..మృత్యువు పిలుపు!

- అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ చివర డేంజర్ బెల్
- వాహనాల అతి వేగంతో ప్రమాదాలు
- వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ బారికేడ్లు లేవు
- మలుపులో దెబ్బతిన్న కల్వర్ట్ అంచు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ చివర ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం ఆద మరిచినా ప్రాణాలకు ప్రమాదంగా పరిణమిస్తోంది. ఈ ప్రాంతంలో రోడ్డు విశాలంగా ఉండటంతో భారీ వాహనాలు సైతం మితిమీరిన వేగంతో ప్రయాణించడమే అందుకు నిదర్శనం. మలుపు వస్తుందని తెలిసినా రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలు వేగాన్ని తగ్గించకుండా టర్నింగ్ కొట్టడంతో ఎదురుగా వచ్చే వాహనాల డ్రైవర్లు స్టీరింగ్ కంట్రోల్ చేసుకోలేక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా లోడుతో ప్రయాణించే భారీ వాహనాలు కూడా మలుపులో వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో బోల్తా పడిన సంఘటనలు అనేకం. వాటిల్లోని సరుకు రోడ్డుపై పడిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న దంపతులు ఈ మలుపులోనే వేగాన్ని కంట్రోల్ చేసుకోలేక పోవడంతో బోల్తా పడి పక్కనే ఉన్న పంట కాలువ బోదెలోకి వెళ్లి పోవడం, వెంటనే కారులో నుంచి మంటలు రావడం జరిగిపోయాయి. అదృష్టవశాత్తు ఆ దంపతులు అప్రమత్తులై బోల్తా పడిన కారులో నుంచి అతి కష్టంపై బయటకు వచ్చేయడంతో ప్రాణ గండం తప్పింది. డేంజర్ బెల్స్ మోగిస్తున్న ఈ మలుపులో ప్రమాదాలు నిత్యకృత్యమైనా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకున్న దాఖలాలు శూన్యం.


ప్రమాదకరంగా ఉన్న మలుపు

విజయవాడ సిటీలోకి వచ్చే వాహనాల మళ్లింపు ఇక్కడే...

హైదరాబాద్ వైపు నుంచి 65వ నంబర్ జాతీయ రహదారి మీదుగా విజయవాడ నగరంలోకి వచ్చే వాహనాలను గొల్లపూడి బైపాస్ రోడ్‌లోని అట్కిన్‌సన్ స్కూల్ రోడ్‌లోకి పోలీసులు మళ్లించారు. ఆ రోడ్ చివర ఉన్న ప్రమాదకరమైన మలుపు దాటుకుని ఊర్మిళానగర్ - కబేళా సెంటర్ నుంచి చనుమోలు వెంకట్రావు (సీవీఆర్) ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణించి చిట్టినగర్‌లోకి రావల్సి ఉంటుంది. అక్కడ నుంచి విజయవాడ నగరంలో ఎక్కడికైనా వెళ్లవచ్చు. హైదరాబాద్ వైపు నుంచి సాధారణ లారీలు, 10–12 టైర్ల లారీలు, కంటైనర్లు, ట్రాలీలు వంటి భారీ వాహనాలన్నీ అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. అదే సమయంలో కబేళా వైపు నుంచి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్‌లోకి వచ్చే వాహనాలు ఎదురు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధిక లోడు, మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు మలుపుల్లో ఎంతో జాగ్రత్తగా వెళ్లాల్సి ఉన్నప్పటికీ డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనేది సుస్పష్టం.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే అట్కిన్‌సన్ స్కూల్, కబేళా రోడ్‌లోని మలుపులో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి. కబేళా సెంటర్ వైపు వెళ్లే రోడ్‌లో రెండు ఫంక్షన్ హాళ్లు, పోలేరమ్మ గుడి ఉన్నాయి. భార్యా పిల్లలతో ద్విచక్ర వాహనంపై అటు వైపు వెళ్లాలన్నా అతి వేగంతో వస్తున్న భారీ వాహనాలతో భయం వేస్తోంది. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను చేపట్టాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులపై ఉంది.

– షేక్ హయాత్ షరీఫ్, విద్యాధరపురం

ఇటు అట్కిన్‌సన్ స్కూల్ రోడ్‌లో నుంచి అటు కబేళా సెంటర్ వైపు నుంచి వాహనాలు మలుపు దగ్గరకు వచ్చే ముందే స్పీడ్ బ్రేకర్లు గానీ లేదా జిగ్‌జాగ్ బారికేడ్లు గానీ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపులో

వాహనాల వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ బారికేడ్లు ఏవీ?

ఉన్న కల్వర్ట్ అంచు దెబ్బతిని ఉండటంతో అక్కడ వేగంగా టర్న్ అయ్యే వాహనాలు సరిగ్గా కల్వర్ట్ అంచు మీదుగా ప్రయాణిస్తున్నాయి. అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ చివర మలుపు తిరిగే ముందు పెద్ద గొయ్యి ఉండటంతో భారీ వాహనాలు సైతం ఆ గొయ్యిని తప్పించుకుని వెళుతున్నాయి తప్ప గుంత ఉందని తెలిసి వేగం తగ్గించక పోవడం గమనార్హం.


మలుపులో దెబ్బతిన్న కల్వర్ట్ అంచు

క్లుప్తంగా

క్రీడా విజేతలకు అభినందన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జూనియర్ స్టేట్ జూడో చాంపియన్ షిప్ 2024–25 పోటీలలో జక్కంపూడిలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. గెలుపొందిన వి.లక్ష్మీతిరుపతమ్మ, కె.పల్లవి, బి.జాహ్నవిలను హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మ ప్రశంసించారు. విజేతలకు స్ఫూర్తిని కలిగించడంతో పాటు సహాయ సహకారాలను అందించిన జక్కంపూడి-2 సచివాలయ సెక్రటరీ ఎస్.ఉషారాణి, జూడో కోచ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విజేతలను అభినందించిన వారిలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్.అశోక్ కుమార్ ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

బీబీఏ ఎన్నికలకు నామినేషన్లు

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల పర్వం సందడిగా కొనసాగింది. ఎన్నికల ప్రధాన అధికారి డి.పి.రామకృష్ణ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష స్థానానికి విష్ణుబొట్ల లక్ష్మీనారాయణ, ఎ.కె.బాషా, బి.డేవిడ్ రత్నకుమార్, తదితరులు పోటీచేస్తున్నారు. ప్రధాన కార్యదర్శిగా రావూరి చునావ్, కె.వి.రంగారావు, బైపూడి నాగేశ్వరరావు తదితరులు పోటీలో ఉండగా, వైస్ ప్రెసిడెంట్‌గా పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పోటీ చేస్తున్నారు.

నేటి నుంచి ఎస్‌పీఏ జాతీయ క్రీడా పోటీలు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏ) జాతీయ పోటీలకు విజయవాడలోని ఎస్‌పీఏ ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానం వేదికైంది. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలకు ఢిల్లీ, భోపాల్, విజయవాడ ఇన్‌స్టిట్యూషన్స్ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయని ఆర్కిటెక్చర్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ శ్రీకొండ తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్ క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: నిబంధనలు అతిక్రమించి మద్యం తాగడమే కాకుండా, వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన మందుబాబులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు నగర పోలీసు కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. నగరంలో రెండో ట్రాఫిక్ పోలీసులు 23 కేసులు, 4వ ట్రాఫిక్ పోలీసులు 5 కేసులు, 5వ ట్రాఫిక్ పోలీసులు 15 కేసులు నమోదుచేసి, ఆరో అడిషనల్ జ్యుడీషియల్ మెట్రోపాలిటన్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు 10 మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు, 33 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేస్తున్నామని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు సూచించారు.

హుండీ ఆదాయం రూ.3.87 లక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థాన హుండీ ఆదాయం రూ. 3.87 లక్షలు వచ్చినట్లు ఈఓ వై సీతారామయ్య తెలిపారు. గురువారం దేవస్థానంలో ఆలయానికి చెందిన నాలుగు హుండీల కానుకలను లెక్కించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అప్పన సదాశివ సూర్యనారాయణ, దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణ అధికారిగా సుజన్, రెవెన్యూ అధికారి పద్మకుమారి, పోలీస్ పర్యవేక్షణలో కానుకలను లెక్కించారు. 90 రోజుల గాను ఆలయ హుండీ ఆదాయం రూ. రూ.3,87,121 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ దఫా బంగారం, వెండి, ఇతర వస్తువులు రాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూ సేవాదళ్ సభ్యులు, కెనరా బ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

24న చలో పార్లమెంట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆటో, లారీ, ట్యాక్సీ, ప్రైవేట్ బస్సు, ఇతర రవాణా రంగ డైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 24న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు ఎన్‌సీహెచ్ శ్రీనువాస్ పిలుపునిచ్చారు. రాణిగారితోటలోని యూని యన్ కార్యాలయంలో చలో పార్లమెంట్ కరపత్రాలను గురువారం ఆవిష్కరించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సోమేశ్వరరావు, జిల్లా ఆటో యూనియన్ నాయకులు ఉదయ్‌కుమార్, వినోద్, ప్రభాకర్, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కఠోర నియమాల మాసం రంజాన్

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కఠోర నియమాల మాసం రంజాన్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ నేత గోరు సలీమ్ ఆధ్వర్యంలో వించిపేటలోని ఆయన ఇంటి వద్ద గురువారం రాత్రి ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలన్నారు. అనంతరం పంజా సెంటర్‌లోని హలీం స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేత పోతిన మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు మండేపూడి చటర్జీ, షేక్ ఇర్ఫాన్, జిలా మైనార్టీ విభాగ అధ్యక్షుడు షేక్ మస్తాన్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనకాపల్లిలో దీపు అనే ట్రాన్స్‌జెండర్ (హిజ్రా)ను అతి క్రూరంగా హత్య చేసిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం విజయవాడ యనమలకుదురులో ఉన్న రాష్ట్ర శిశు సంక్షేమ, వృద్ధుల, హిజ్రాల, దివ్యాంగుల శాఖ డైరెక్టర్ రవి ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కేఎల్‌రావు పార్కులో రూ.6 లక్షలతో ఆట పరికరాలు

వేసవిలో చిన్నారులకు ఆహ్లాదం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఈ వేసవిలో చిన్నారులకు కేఎల్‌రావు పార్కు ఆహ్లాదం పంచనుంది. పార్కు అభివృద్ధిపై డివిజన్ కార్పొరేటర్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు పనులను శరవేగంగా చేయిస్తున్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కూడా పార్కుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పార్కులో ఇప్పటికే వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి కాగా, చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. రూ.6 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు ధ్వంసం కావడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పనులు పూర్తయి ఆట వస్తువులు అందుబాటులోకి రానున్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు ఉయ్యాల, రెండు రౌండ్ స్పినర్లు, నెట్ రాక్ క్లైంబింగ్ ఒకటి, బ్యాలెన్స్ రాడ్‌లు రెండు, జారుడు బల్లలు రెండు ఏర్పాటు చేస్తున్నారు.



పార్కుకు తీసుకువచ్చిన ఆట వస్తువులు

ముగిసిన సురభి నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాల్లో నిర్వహిస్తున్న సురభి పద్య నాటకోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో సురభి ఆర్ట్స్ అసోసియేషన్, సురభినాట్య కళామండలి ఆధ్వర్యంలో మాయాబజార్ నాటికను ప్రదర్శించారు. నాటకంలో నిర్వాహకులు ప్రదర్శించిన అంశాలు సురభినాటక వైభవాన్ని చాటాయి. ముఖ్యంగా ఘటోత్కజుడి ప్రవేశం, అభిమన్యుడు, ఘటోత్కజుడి యుద్ధం, మాయా శశిరేఖ వివాహం తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

నాటకంతోనే కళాకారుల జీవన ప్రయాణం

నాటకంతోనే సురభి కళాకారుల జీవన ప్రయాణం సాగుతుందని, సాంకేతికంగా వస్తున్న మార్పులను వారు ప్రదర్శనలో ఏర్పాటు చేస్తారని కూచిపూడి నాట్యాచారిణి స్వర్ణలత అన్నారు. ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో కుటుంబ సభ్యులందరూ నాటకం కోసమే జీవించడం అరుదైన సంఘటనగా అభివర్ణించారు. సంగీత కళాశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తమ పాకెట్‌మనీలోనుంచి వారికి విరాళం అందజేశారు. సాంస్కృతిక శాఖ నిర్వాహకుడు సుమన్, నర్తనం పత్రిక ప్రధాన సంపాదకురాలు మాధవి పురాణం పాల్గొన్నారు.



మాయాబజార్ నాటకంలోని సన్నివేశాలు

వీఎంసీ బడ్జెట్‌పై అధికారులతో మేయర్ సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై సంబంధిత అధికారులతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి తన చాంబర్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్, అందులో పొందుపరిచే అంశాలపై చర్చించారు. ప్రధానంగా కౌన్సిల్ అజెండా, అడిషనల్ అజెండా, ఉన్న ప్రతిపాదనలను శాఖధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలకు అధికారులు అందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సెక్రటరీ వసంతలక్ష్మి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం, డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, జాయింట్ డైరెక్టర్ (అమృత్), ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ లత, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్‌పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

కనులపండువగా స్వామివారి కల్యాణం


శ్రీ కోదండ రామాలయంలో స్వామి కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం కోదండ రామచంద్ర స్వామి, వెంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల కల్యాణం కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అలాగే లోక కల్యాణార్థం ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై పలువురు ఉద్యోగులను అంతర్గతంగా బదలీ చేస్తూ ఆలయ ఈవో కె.రామచంద్ర మోహన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లలో ల్యాండ్స్, లీజెస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న బి.నాగేశ్వరరావును డోనర్ సెల్‌కు, జి.యశ్వంత్‌ను అన్నదానానికి బదిలీ చేశారు. స్టేషనరీ, ఎంపీ.ఫామ్స్, శారీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పి.శిరీషను ఫెస్టివల్, పూజల విభాగానికి, దత్తత దేవాలయాలు, కనకదుర్గ ప్రభ విభాగ బాధ్యతలు నిర్వహిస్తున్న జె.కామేశ్వరిని స్టేషనరీ, ఎంపీ.ఫామ్స్ విభాగానికి బదిలీ చేశారు. ధర్మపథం, సాంస్కృతిక కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న పి.రత్నారెడ్డిని, కేశఖండన శాల, ధర్మపథం బాధ్యతలు అప్పగించారు. డోనర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న బి.త్రినాథ్‌కు పీఆర్వో, ధర్మపథం బాధ్యతలు అప్పగించారు. లడ్డూ తయారీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కె.సీతారామయ్యకు ల్యాండ్స్, లీజెస్ విభాగానికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్లు జీఎల్‌వీఆర్ చౌదరిని మెయిన్ టెంపుల్ నుంచి మల్లేశ్వరాలయం, దత్తత దేవాలయాలకు, కె.లక్ష్మణ స్వామిని అకౌంట్స్, ట్రస్ట్ బోర్డుకు, ప్రొటోకాల్‌లో విధులు నిర్వహిస్తున్న నాధురాంను మెయిన్ టెంపుల్‌కు, అన్నదానంలో విధులు నిర్వహిస్తున్న కె.నరసింహారావును ప్రొటోకాల్‌కు బదిలీ చేశారు. ఏఈవో జంగం శ్రీనివాసన్‌కు అన్నదానం, దత్తత దేవాలయాలు, నిత్య పూజలు, వేద పాఠశాల బాధ్యతలు అప్పగించారు. పి.చంద్రశేఖర్‌కు పరిపాలనా విభాగం, లీగల్ సర్వీసు, మెయిన్ టెంపుల్, శానిటేషన్, సబ్ టెంపుల్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఎం.దుర్గారావుకు ప్రసాదాల తయారీ, ల్యాండ్స్, లీజెస్, లీగల్ సర్వీసులు, పూజల విభాగాలను కేటాయించారు.

విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలి

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని లయోలా ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఎం. విజయకుమార్ అన్నారు. ఆంధ్రా లయోలా కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సాంకేతిక సదస్సులు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కరెంట్ ఎఫైర్స్‌పై దృష్టి సారించాలన్నారు. ఆధునిక సాంకేతికత పోకడలపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు శ్రావణ్‌కుమార్, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆర్థిక ప్రణాళిక అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రణాళికతో ముందుకు సాగినప్పుడే చక్కని జీవితాన్ని సాధించేందుకు అవకాశముంటుందని ప్రముఖ ఫైనాన్షియల్ ట్రైనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో పర్సనల్ ఫైనాన్షియల్ ప్లానింగ్ అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సెబీ సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ట్రైనర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక ఆవశ్యతను వివరించారు. ప్రధానంగా పెట్టుబడులు, వ్యూహాలు, సంపద నిర్మాణం, రిస్క్ మేనేజ్‌మెంట్, ట్యాక్స్ ప్లానింగ్ వంటి అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఈ విధమైన అంశాలతో ముందుకు అడుగులు వేసినప్పుడే విద్యార్థులు భవిష్యత్‌లో ఆర్థికంగా పరిపుష్టిని సాధిస్తారని చెప్పారు. భవిష్యత్‌కు సరైన ఆర్థిక లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ విధమైన ఆర్థిక ప్రణాళిక భవిష్యత్ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

సినీ నటుడు శోభన్‌బాబుకు ఘన నివాళి

విజయవాడ కల్చరల్: నటభూషణుడు, సినీ నటుడు శోభన్‌బాబు అని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం శోభన్‌బాబు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ శోభన్‌బాబు తన నటన ద్వారా తెలుగు అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నట్లు తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు మాట్లాడుతూ శోబన్‌బాబు తెలుగు సినిమాలలో విభిన్నమైన పాత్రలు పోషించినట్లు తెలిపారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, పైడిపాటి వెంకన్న, బీవీ వీరభద్రరావు, ఆదిరాల జయప్రభ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు లాకుల సెంటర్‌లో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు లాకుల సెంటర్‌లో గురువారం శోభన్‌బాబు సిండికేట్ ఆధ్వర్యంలో నటభూషణ్ శోభన్‌బాబు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శోభన్‌బాబు సిండికేట్ సభ్యులు శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శోభన్ సిండికేట్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్లెపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధారా సత్యం ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. సిండికేట్ సభ్యులు ఆయన మధుర స్మృతులు నెమరు వేసుకున్నారు. శోభన్ బాబు అందరికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన జీవిత విశేషాలు వివరించారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారు రేమాల రామకృష్ణ, కన్వీనర్ బి.ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ కే జగన్మోహన్, సహాయ కార్యదర్శి వెంకట్, సలహాదారులు రామకృష్ణ, శోభన్ బాబు అభిమానులు పాల్గొన్నారు.


శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

రేపటి నుంచి శ్రీవారి ఉదయాస్తమాన సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉదయాస్తమాన సేవలు తిరుమలలో జరిగే విధంగా విజయవాడలోనూ నిర్వహించనున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో సేవలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం రోటరీ మిడ్‌టౌన్ సభ్యులు ఆవిష్కరించారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ 22న ఉదయం 6 నుంచి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన ఉంటాయన్నారు. అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. 23న సుప్రభాతసేవ, సహస్ర నామార్చనతో పాటు, 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు వివిధ రకాల పుష్పాలతో శోభాయాత్ర నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో చైర్మన్ శ్రీనివాస్ బాలాజీ, కన్వీనర్ యడ్ల పార్థసారథి, క్లబ్ సెక్రటరీ బి.సుందర్ రెడ్డి ప్రతినిధులు కాసుల బ్రహ్మం, సంపత్, వనమా గణేష్, చారుగుండ్ల రమేష్, నంబూరు జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం 28న చలో కలెక్టరేట్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని పేదలకు స్థలాల సాధనకు ఈనెల 28న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం, టిడ్కో ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పేదలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28 వరకు ''ప్రజాచైతన్య యాత్ర'' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. టిడ్కో లబ్ధిదారులు చెల్లించిన డిపాజిట్లు పూర్తి స్థాయిలో తిరిగి చెల్లించాలని, లేదా ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుడమేరు వరద ముంపు సమస్యను గాలికొదిలేసిన ప్రభుత్వం పేపరు ప్రకటనలకే పరిమితమైందన్నారు. 57 ఎకరాల డిస్నీల్యాండ్, 25 ఎకరాల రైల్వే స్థలాన్ని, మరో 25 ఎకరాల చెత్త డంపింగ్ స్థలాలపై బడా కంపెనీలు, పెద్దల కన్ను పడిందన్నారు. ఈ స్థలాలను పేదల ఇళ్ల స్థలాలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పశ్చిమ, సెంట్రల్, తూర్పు సిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, బి.రమణారావు, పి.కృష్ణ పాల్గొన్నారు.